ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 20.05.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

2. హైదరాబాద్ పాతబస్తీలో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణకు ఆరుగురు ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

3. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల ప్రారంభోత్సవంలో భాగంగా రాష్ట్రంలో పునరుద్ధరించిన బేగంపేట, కరీంనగర్, వరంగల్ రైల్వే స్టేషన్లను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎల్లుండి ప్రారంభిస్తారు.

4. ఈరోజు , రేపు జరిగే మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా పోటీదారులు తమ సృజనాత్మకతను, భావ ప్రకటనా నైపుణ్యాలను ప్రదర్శిస్తారు.

<u>భూభారతి – పొంగులేటి</u>

పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ , గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంచిర్యాల జిల్లా , భీమారం మండల కేంద్రంలో నిర్వహించిన భూ భారతి చట్టం - రెవెన్యూ సదస్సులో ఈరోజు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన భూభారతి చట్టం దేశానికే ఆదర్శంగా

నిలుస్తుందని అన్నారు. ఈ చట్టం వల్ల భూ సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని పేర్కొన్నారు.

సౌండ్ బైట్: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పిటిసీ, మంచిర్యాల

గుల్జార్ హౌజ్ ప్రమాదం

హైదరాబాద్ పాతబస్తీలోని గుల్జార్‌హౌజ్ సమీపంలో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణ విచారణకు తెలంగాణ ప్రభుత్వం ఆరుగురు ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు వివరాలను హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ కమిటీలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ , హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ , TGSPDCL సీఎండీ ముషారఫ్‌లతో కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈనెల 18న జరిగిన అగ్నిప్రమాద ఘటనపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరపాలని కమిటీని ప్రభుత్వం ఆదేశించింది.

డెస్క్

PM - BEGUMPET RAILWAY STATION

దేశ వ్యాప్తంగా 103 అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల ప్రారంభోత్సవంలో భాగంగా పునరుద్ధరించిన బేగంపేట్ రైల్వే స్టేషన్ ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎల్లుండి వర్చువల్ గా ప్రారంభిస్తారు. అలాగే తెలంగాణలోని పునరుద్ధరించిన కరీంనగర్ , వరంగల్ రైల్వే స్టేషన్లను కూడా ప్రారంభిస్తారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద బేగంపేట్ రైల్వే స్టేషన్ ను 26 కోట్ల 55 లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఆధునీకరించారు. ఇందులో భాగంగా - ఎస్కలేటర్లు , లిఫ్ట్ లు, విశాలమైన వెయిటింగ్ హాల్స్, ఆధునిక టాయిలెట్లు, వికలాంగ ప్రయాణికుల కోసం ప్రత్యేక సౌకర్యాలు ఉన్నాయి.

NSD

<u>వాల్టా రాష్ట్ర స్థాయి అధారిటీ సమావేశం:</u>

వాటర్ లాండ్ అండ్ ట్రీస్ 2002 చట్టం (వాల్టా) కింద చేపట్టాల్సిన చర్యలపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి అనసూయ సీతక్క అధ్యక్షతన వాల్టా రాష్ట్రస్థాయి అధారిటీ ఈ రోజు సమావేశం అయింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర స్థాయి అధారిటీ సమావేశం కావడం ఇదే మొదటిసారి. వాల్టా చట్టానికి అనుగుణంగా జిల్లాస్థాయి అధారిటీల ఏర్పాటు , పర్యావరణం సహజ వనరుల పరిరక్షణ కోసం ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం , గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ , వోల్టా ఫండ్ ఏర్పాటు , నీటిని ఎక్కువగా వినియోగించే గ్రామాల నోటిఫికేషన్ లాంటి పలు అంశాలను ఈ సమావేశంలో చర్చిస్తారు.

---MSL

BREAK

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు వింటున్నారు. మరిన్ని updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ air news_hyd ను ఫాలో అవండి. AIR News Hyderabad YouTube Channel ను సబ్ స్క్రైబ్ చేయండి.

<u>బండి సంజయ్ – తిరంగా ర్యాలీ</u>

ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిన సందర్భంగా బీజేపీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిన్న రాత్రి కరీంనగర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిన్న నిర్వహించిన తిరంగా ర్యాలీలో మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందనరావు పాల్గొన్నారు. జనగామ పట్టణంలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొన్నారు.

పిటిసి, కరీంనగర్, సిద్ధిపేట, జనగామ

NVSS ప్రభాకర్

కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలు విషయంలో.. రాష్ట్ర వాటా ఇవ్వకుండా ప్రాజెక్టులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడ్డుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు , మాజీ ఎమ్మెల్యే NVSS ప్రభాకర్ విమర్శించారు. అలాగే కాళేశ్వరం అవినీతి , విద్యుత్ కొనుగోళ్ల అవినీతి, ఫోన్ ట్యాపింగ్ విచారణ వ్యవహారాలు నీరుగారిపోతున్నాయని ఆరోపించారు.

పీఎస్

<u>మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రి</u>

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు వైద్య సేవలు అందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ తెలిపారు.

సౌండ్ బైట్ : ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్

పీటీసీ, భద్రాద్రి కొత్తగూడెం

<u>మిస్ వరల్డ్:</u>

హైదరాబాద్ లో జరుగుతున్న మిస్ వరల్డ్ ఈవెంట్ లో పోటీలు ఈ ఉదయం టీహబ్ లో మొదలయ్యాయి. ఈరోజు, రేపు జరిగే పోటీల్లో పోటీదారులకు తమ సృజనాత్మకతను , భావ ప్రకటనా నైపుణ్యాలను ప్రకటించే అవకాశం వస్తుంది. అలాగే తమకు స్ఫూర్తిని అందించే విషయాల గురించి కూడా తమ భావాలను వ్యక్తం చేసే వీలుంటుంది. పోటీదారుల్లో అమెరికా-కరేబియన్ ఖండానికి చెందిన వారు ఈ ఈవెంట్లలో ఈరోజు పాల్గొంటారు. యూరోప్ , ఆసియా ఓసియానా దేశాల ప్రతినిధులు రేపు పోటీ పడతారు. మిస్ వరల్డ్ మిషన్ - బ్యూటీ విత్ ఎ పర్పస్ అనే ఇతివృత్తానికి సంబంధించి , స్వచ్ఛంద సేవ, సమాజ హిత ప్రాజెక్టులు , తదితర అంశాలలో పోటీదారులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ పోటీలు అవకాశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

-------MSL

వాతావరణం

రాగల 24 గంటల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఉరుములు , మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ విభాగం అంచనా వేసింది. కరీంనగర్ , పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి , ములుగు, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

పీఎస్

జాతీయ లోక్ అదాలత్

ఆసిఫాబాద్ జిల్లాలో వచ్చే నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం వి రమేష్ అన్నారు. ఈరోజు ఉదయం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ లో రాజీ పడేందుకు అవకాశం ఉన్న క్రిమినల్ కేసులు , సివిల్ కేసులు, ప్రి-లిటిగేషన్ కేసులు, బ్యాంకు, ఎలక్ట్రిసిటీ, భూ తగాదా కేసులు , వివాహ/కుటుంబ తగాదాల కేసులు , మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు , చిట్ ఫండ్ , చెక్ బౌన్స్ కేసులు తదితర కేసులు పరిష్కారం అవుతాయని అన్నారు.

సౌండ్ బైట్ ... ఎం వి రమేష్

పిటిసి, ఆసిఫాబాద్

IPL

ఐపిఎల్ 2025 క్రికెట్ లో ఈరోజు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగే మ్యాచ్ లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు, రాజస్థాన్ రాయల్స్ జట్టుతో ఆడుతుంది. ఈ మ్యాచ్ రాత్రి 7.30 గంటలకు ప్రారంభమవుతుంది.

NSD

రోడ్డు ప్రమాదం

వికారాబాద్ జిల్లా పరిగి మండలం రంగాపూర్ సమీపంలో 163వ జాతీయ రహదారిపై నిన్న అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మరణించారు. మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. పెళ్లి బృందంతో వెళుతున్న బస్సు రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలానికి చెందిన వారు నిన్న రాత్రి వివాహ విందుకు హాజరై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. వికారాబాద్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ఈ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

పీటీసీ, వికారాబాద్

ఎండ్

ఆకాశవాణి వార్తలు సమాప్తం. తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.